# ఆరుతడి పంటలే మేలు

- వరి సాగులో తగ్గుతున్న దిగుబడి, పెరుగుతున్న పెట్టుబడి భారం
- మితిమీరిన రసాయనాల వాడకంతో ఆహారం, నీరు, భూమి కాలుష్యం
- ఆరుతడి పంటల్లో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలంటున్న వ్యవసాయ నిపుణులు



ఇందల్వాయి, డిసెంబర్ 2 : మూడు సీజన్ల నుంచి వరి రైతులు వరుసగా నష్టాల పాలవుతున్నారు. ఏటా దిగుబడి తగ్గుతుండడంతోపాటు పెట్టుబడులు తడిసి మోపెడవుతున్నాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సాగులో సాంకేతికత లేకపోవడం, సాగుపై రైతుల్లో అవగాహన లోపం, చీడపీడల ఉధృతి దిగుబడి తగ్గడానికి ప్రధాన కారణాలుగా వ్యవసాయ అధికారులు విశ్లేషిస్తున్నారు. నాణ్యమైన దొడ్డురకం వరి వంగడాల సాగుతో ఎకరాకు గరిష్ఠంగా 32 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. కానీ గత యాసంగి పంట నుంచి వరుసగా మూడు సీజన్లలో గరిష్ఠంగా 28, కనిష్ఠంగా 22 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చిందని రైతులు పేర్కొంటున్నారు. ఆరుతడి పంటలే మేలని, రైతులు ఆ దిశగా దృష్టి సారించాలని వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

**తగ్గిన దిగుబడి..**

వరి పంటను కొంతకాలంగా మెడ విరుపు, మొగిపురుగు వంటి చీడపీడలు ఆశించడంతో దిగుబడి తగ్గిపోయింది. గత సీజన్‌లో వర్షాలతో పంట దెబ్బతిని కర్షకులు కష్టాల పాలయ్యారు. ప్రస్తుత సీజన్‌లో సైతం దిగుబడులు తగ్గాయని రైతులు పేర్కొంటున్నారు. ఎకరాకు వరి పండించడానికి రైతులకు రూ. 30 వేల పైనే పెట్టుబడి అవుతుంది. దీనికి రైతు శ్రమ అదనం. ఎకరానికి సగటున 28 క్వింటాళ్ల దిగుబడి వచ్చినా పెట్టుబడులు పోగా రైతుకు మిగిలేది సుమారు రూ.18 వేలు మాత్రమే.

**ఆరుతడి పంటలతో అధిక లాభాలు..**

ఆరుతడి పంటల వలన ఖర్చు తగ్గడంతోపాటు ఆదాయం కూడా రెండింతలు పెరిగే అవకాశముందని అధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. వరి ఎకరాకు అయ్యే నీటిని రెండు నుంచి మూడెకరాల ఆరుతడి పంటల సాగుకు వినియోగించవచ్చని పేర్కొంటున్నారు. చలికాలంలో ఆరుతడి పంటల సాగు రైతులకు ఎంతో శ్రేయస్కరంగా ఉంటుందని తెలుపుతున్నారు. ఆరుతడి పంటలైన మినుములు, పెసర్లు, వేరుశనగ, కందులు, ఆముదం తదితర పంటలకు తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి వస్తుందని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. ఆరుతడి పంటల ద్వారా చీడపీడల సమస్యలు ఉండవని, తక్కువ కాలంలో పంటలు చేతికి వస్తాయని తెలిపారు.

**పంట మార్పిడి చేపట్టాలి..**

పంట మార్పిడి ద్వారానే అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తల అభిప్రాయం. ప్రతిసారి వరి పంటను సాగుచేయడం ద్వారా అధికంగా నీటి వినియోగంతోపాటు రసాయనిక ఎరువులు విరివిగా వాడడంతో భూమిపై దుష్ప్రచారం చూపిస్తుందని పేర్కొంటున్నారు. వాస్తవానికి సేంద్రియ ఎరువులు, రసాయనిక ఎరువులు సమపాళ్లలో వాడితే పెద్దగా ఇబ్బంది ఉండదని చెబుతున్నారు.

**పంట దిగుబడి తగ్గడానికి గల కారణాలు:-**

- పంట మార్పిడి చేయకపోవడం
- భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులు వాడకపోవడం
- పచ్చిరొట్ట సాగు చేయకపోవడం, చిరుపొట్ట దశలో పొటాష్ ఎరువు వాడకపోవడం
- మోతాదుకు మించి క్రిమిసంహారక మందులు వాడడం, పంట కాల పరిమితికి ముందే కోతలు కోయడం

**ప్రత్యామ్నాయాలు ఆలోచించాలి..**



ఏండ్ల తరబడి పంట మార్పిడి చేయకపోవడంతో భూమి నిస్సారంగా మారి దిగుబడులు గణనీయంగా తగ్గుతున్నాయి. రైతులు ఇకనైనా వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటల సాగుపై దృష్టిసారించాలి. దీంతో భూసారం పెరిగి దిగుబడులు పెరగడమే కాకుండా నీరు, రసాయనిక ఎరువుల వినియోగం తగ్గుతుంది.

**- ప్రవీణ్, ఇన్‌చార్జి ఏవో, ఇందల్వాయి**

## రేపు బాస్కెట్‌బాల్, బీచ్ వాలీబాల్ ఎంపిక పోటీలు

నిజామాబాద్ స్పోర్ట్స్, డిసెంబర్ 2 : ఉమ్మడి జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్, బీచ్ వాలీబాల్ ఎంపిక పోటీలను నిజామాబాద్ జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సంగీతారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ కేంద్రంలోని డీఎస్‌ఏ గ్రౌండ్స్‌లో ఈ నెల 4వ తేదీన బాస్కెట్‌బాల్ ఎంపికలు, 5వ తేదీన కలిగోట్ గ్రామంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో బీచ్ వాలీబాల్ ఎంపికలు నిర్వహించనున్నట్లు వివరించారు. మరిన్ని వివరాలకు పీఈటీలు రమేశ్ 9440007004, యాదగిరి 94902 94414 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపిన పోచారం సురేందర్‌రెడ్డి



చందూర్, డిసెంబర్ 2 : ఎన్నికల వేళ నియోజకవర్గంలో రాత్రింబవళ్లు పోచారం శ్రీనివాసరెడ్డికి మద్దతుగా ప్రచారం పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల వేళ హామీలిచ్చి, తర్వాత ప్రజల్లో కనబడని నాయకులను ప్రజలు నమ్మరని, ప్రజలకు ఎవరిని గెలిపించాలో తెలుసని పేర్కొన్నారు. నేడు (ఆదివారం) వెలువడనున్న ఫలితాల్లో పోచారం శ్రీనివాసరెడ్డి భారీ మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు.

## 11న మహాలింగార్చన

నిజామాబాద్ కల్చరల్, డిసెంబర్ 2 : నగరంలోని న్యాల్‌కల్‌రోడ్‌లో ఉన్న లలితాదేవి ఆశ్రమాలయంలో ఈనెల 11న సాయంత్రం 6 గంటల నుంచి మహాలింగార్చన నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు వేలేటి రాజేందర్ శర్మ శనివారం తెలిపారు. కార్తీకమాసం పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విశేష పూజలు అనంతరం తీర్థ ప్రసాదాల వితరణ ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## 5న వర్ని మండల సర్వసభ్య సమావేశం

వర్ని, డిసెంబర్ 2 : వర్ని మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 5వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీపీ మేక శ్రీలక్ష్మీ వీర్రాజు తెలిపారు. మండలంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అధికారులు పూర్తి వివరాలతో సమావేశానికి హాజరుకావాలని సూచించారు. సభ్యులు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

## నర్సరీ పరిశీలన

ఇందల్వాయి, డిసెంబర్ 2 : మండలంలోని గంగారాం తండాలో ఏర్పాటు చేసిన వన నర్సరీని ఎంపీడీవో రాములునాయక్ శనివారం పరిశీలించారు. నర్సరీల్లో మొక్కలను పెంచాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. గ్రామంలో చెత్త చెదారం ఉండకుండా పరిశుభ్రంగా ఉండేలా ఆశావర్కర్లు గ్రామస్తులకు అవగాహన కల్పించాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి, డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. ఆయన వెంట ఎంపీటీసీ దాసు, ఏపీవో పోశెట్టి తదితరులు ఉన్నారు.

## పాతంగల్ హెచ్‌ఎంకు ఘనంగా వీడ్కోలు



హెచ్‌ఎం రజనీప్రియకు వీడ్కోలు పలుకుతున్న విద్యార్థులు

కోటగిరి, డిసెంబర్ 2 : పాతంగల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని రజనీప్రియ ఉద్యోగ విరమణ చేశారు. ఆమెకు పాఠశాల ఆవరణలో సన్మాన సభ, వీడ్కోలు కార్యక్రమాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ మండల అధ్యక్షుడు వెంకటేశ్ మాట్లాడుతూ.. అన్ని వృత్తుల కన్నా ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందన్నారు. రజనీప్రియకు ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పోచారం గెలవాలని ప్రత్యేక ప్రార్థనలు



ఇబ్రహీంపేట్‌లోని దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

బాన్సువాడ రూరల్, డిసెంబర్ 2 : బీఆర్‌ఎస్ బాన్సువాడ నియోజకవర్గ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి భారీ మెజార్టీతో గెలవాలని కోరుతూ మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామంలో ముస్లింలు హజ్రత్ ఇబ్రహీం పాషా దర్గాలో శనివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బాన్సువాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన పోచారం భారీ మెజార్టీతో గెలవాలని ప్రార్థించారు. కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మూడోసారి సీఎం కావాలని ప్రార్థించారు. తొమ్మిదేండ్లలో సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేశారని అన్నారు. పోచారం వెంటే నియోజకవర్గ ప్రజలు ఉన్నారని, బాన్సువాడలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహ్మద్ వస్సీ, సమద్, మోహిన్, సాహిల్, అబూ ఖమర్ తదితరులు పాల్గొన్నారు.

## కేశ్‌పల్లిలో ఆయుర్వేద శిబిరం



ఆయుర్వేద శిబిరంలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

జక్రాన్‌పల్లి, డిసెంబర్ 2 : మండలంలోని కేశ్‌పల్లిలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల - పడకల్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దీర్ఘకాలిక రోగాలు, రక్తపోటు, మధుమేహం, కీళ్లనొప్పులు, చర్మ రోగాలు, పక్షవాతం తదితర వారికి ఆయుర్వేదంలో మంచి మందులు ఉన్నాయని వైద్యురాలు లలిత తెలిపారు. గ్రామంలో పలువురికి వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మైదం మహేశ్వర్, ఎంపీటీసీ మున్నూరు గంగాధర్, ఉపసర్పంచ్ భాస్కర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి డి.శ్రీధర్, ఫార్మాసిస్ట్ వరలక్ష్మి, ఏఎన్‌ఎం సుజాత, మహేందర్, యాటకర్ల దేవేశ్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## కృషి విజ్ఞాన్ కేంద్రంలో వ్యవసాయ విద్యా దినోత్సవం







కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త, హాజరైన విద్యార్థులు

రుద్రూర్, డిసెంబర్ 2 : మండలకేంద్రంలోని కృషి విజ్ఞాన్ కేంద్రంలో వ్యవసాయ విద్యా దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. భారత తొలి రాష్ట్రపతి డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ జయంతిని పురస్కరించుకొని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం -కృషి విజ్ఞాన కేంద్రం, ఆహార విజ్ఞాన, సాంకేతిక కళాశాల, వ్యవసాయ పాలిటెక్నిక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ అంజయ్య మాట్లాడుతూ.. దేశ స్థూల వ్యవసాయోత్పత్తి లో వ్యవసాయరంగం ప్రాముఖ్యత, నేల ప్రాముఖ్యత, సంరక్షణ తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.